క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ



అలంకరణలో లక్ష్మీ నృసింహుడు

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విశేష అభిషేకం, మహామంగళహారతి, కుంకమార్చన తో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని ఆలయ పురవీధుల్లో ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. నమో నారసింహ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో ఈఓ విజయ్‌కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం



అలంకరణలో నేమకల్లు ఆంజనేయుడు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న శనీశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉన్న శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రాయదుర్గం ప్రాంత పరిసరాల్లో శనీశ్వరాలయం ఒక్కటే ఉండడంతో ఆలయానికి ప్రతి శనివారం భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ సచివాలయం పరిధిలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు శనివారం ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పింఛన్లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి అలసత్వంతో పింఛన్ పంపిణీ కాస్త ఆలస్యమైందని ఎంపీడీఓ షకీలాబేగం తెలిపారు. కాగా పింఛన్ సొమ్ము అందడంతో లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



ఉదిరిపికొండ జట్టుతో ఎంపీపీ నారాయణ రెడ్డి, అధికారులు

కూడేరు: మండలంలోని కమ్మూరు వద్ద శనివారం 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ ఇప్పేరు సచివాలయ, ఉదిరిపికొండ సచివాలయ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ఉదిరిపికొండ సచివాలయ జట్టు విజయం సాధించి నియోజక వర్గ స్థాయి టోర్నీ పోటీలకు ఎంపికైంది. ఎంపీపీ నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి కప్‌ను ఉదిరిపికొండ జట్టు క్రీడాకారులకు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న రంగారెడ్డి, ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి, జేఏసీ మండల కన్వీనర్ దేవేంద్ర, ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గంగాధర్, సిద్దారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూరా సంక్రాంతి సందడి



రాయదుర్గంలో రంగుల విక్రయాలు



కూడేరులో రంగులను కొనుగోలు చేస్తున్న మహిళలు



వజ్రకరూరులో గుమ్మడికాయ, రంగులు కొంటున్న దృశ్యం

- రైతన్న ఇంట పండుగ సంబరాలు
- కిటకిటలాడిన ఆలయాలు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో పట్టణంతో పాటు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు సంతోషంగా ప్రారంభమయ్యాయి. పండుగ సామగ్రి కొనుగోళ్లతో పట్టణంలో పలు వీధులు, అంగళ్లు జనంతో కిటకిటలాడాయి. పట్టణంలోని గాంధీ సర్కిల్, పాత బస్టాండ్ ఏరియా, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డులో ఉన్న దుకాణాల్లో సందడి కనిపించింది. ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. తెలుగు వారి సంస్కృతికి అద్దం పట్టే కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా మొదలయ్యాయి. పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

కూడేరు: మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు, ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి రంగులు కొనడానికి మహిళలు, పండుగ సరుకులు, గుమ్మడి కాయలు కొనడానికి శనివారం ప్రజలు దుకాణాల వద్దకు పెద్దఎత్తున తరలి వెళ్లారు. దీంతో కిరాణా షాపులు, రంగుల దుకాణాలు ప్రజలతో కిటకిటలాడాయి.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకలు ప్రారంభమయ్యాయి.పట్టణాల్లో నివాసం ఉంటున్న వారు గ్రామాలకు చేరుకుంటుండంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగ వేడుకలు మూడు రోజులపాటు జరుగనున్నాయి. పండుగను పురస్కరించుకుని ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. శనివారం మండల కేంద్రంలోని మెయిన్‌బజార్(కాయగూరల మార్కెట్) సందడిగా మారింది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వజ్రకరూరుకు చేరుకుని పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు. అలాగే పండుగ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

పండుగ శుభాకాంక్షలు



మెట్టు గోవిందరెడ్డి



తలారి రంగయ్య



వై.విశ్వేశ్వర రెడ్డి

రాయదుర్గం/కళ్యాణదుర్గం/ఉరవకొండ: నియోజకవర్గ ప్రజలకు ఏపీఐఐసీ చైర్మన్, రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి సంక్రాంతి శుభాంకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు వేర్వేరు ప్రకటనలు విడదల చేశారు. ప్రజలు సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో జీవించాలని, రైతులు పాడిపంటలు, సిరి సంపదలతో వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఇంటిల్లిపాదీ ఆనందంగా జరుపుకోవాలని వారు భగవంతుడిని ప్రార్థించారు.

పండుగ ప్రశాంతంగా చేసుకోండి

బొమ్మనహాళ్: భోగి, సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పండుగ పురస్కరించుకుని పేకాట, కోడి పందేలు తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించొద్దని, వాటిని ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. అనుమానిత గ్రామాల్లో, ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా సరే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కోడి పందేలు ఆడొద్దు

కూడేరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా ఎవరూ కోడి పందేలు, పేకాట జోలికి వెళ్లొద్దని ఎస్‌ఐ సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు, సంక్రాంతిని సంప్రదాయ ఆటలతో సరదాగా .. సంతోషంగా జరుపుకోవాలన్నారు. కోడి పందేలు, పేకాట ఆడడం ద్వారా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. పండగవేళ కుటుంబంలో గొడవలు జరిగి సంతోషాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. పోలీసు హెచ్చరికను అతిక్రమించి పేకాట, కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైన ఈ ఆటలు ఆడుతున్నట్లు తెలిస్తే 9440796814 లేదా టోల్ ఫ్రీ నంబర్ 100, 112కు సమాచారమివ్వాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలిస్తేనే సంక్షేమం



మాట్లాడుతున్న రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసం వద్ద శనివారం రాయదుర్గం, డి హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డితో కలసి విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, రైతుభరోసా, విదేశీవిద్య, తోడు తదితర పథకాలు లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేర్చారని గుర్తుచేశారు. చంద్రబాబు హయాంలో చెప్పుకోవటానికి ఒక్క పథకం లేదన్నారు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్‌గా మారాడని, అపద్దపు హామీలు, ఆల్ ఫ్రీ ప్రకటనలతో ప్రజలను మరోమారు మోసగించేందుకు సిద్ధమయ్యాడన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచిచేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని హితవు పలికారు. అలాగే' ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే రూ.200 కోట్లతో 15 వేల ఎకరాల్లో సోలార్, డి హీరేహాళ్, జాజరకల్లు వద్ద ఇథనాల్ ఇంధన తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రూ.544 కోట్లతో భూమిపూజకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ పరిశ్రమలు అమల్లోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 12 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట, డి హీరేహాళ్ మండల కన్వీనర్లు గౌని కాంతారెడ్డి, ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, ఎంపీపీ భవాని, కో–ఆప్షన్ దిలవర్‌బాషా, నాయకులు ఆర్టీ కాంతారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేపీదొడ్డి రమేష్, ఆయా మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరిస్తా.. సమ్మె విరమించండి



శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులతో చర్చిస్తున్న ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా .. వెంటనే సమ్మె విరమించాలని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య సూచించారు. సమ్మెలో ఉన్న కార్మికులతో చర్చించేందుకు నేరుగా శనివారం పంప్ హౌస్ వద్దకు సంబంధిత అధికారులతో కలసి ఎంపీ వెళ్లారు. అధికారులు, కాంట్రాక్టర్, కార్మికులతో కలసిలాయన చర్చించారు. తమకు ఐదు నెలల వేతనం అందాల్సి ఉందని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలపై సమస్యలున్నాయని ఎంపీ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీ వెంటనే ఒక నెల వేతనం అక్కడి నుంచే కార్మికుల అకౌంట్లలోకి జమ చేయించారు. మరో రెండు రోజుల్లో రెండు నెలల వేతనం వేయిస్తానని, కొంత సమయమిస్తే మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితులు కల్పించకూడదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా..

జర్నలిస్టులకు అండగా ఉంటానని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాత్రికేయుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నిర్మాణం, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు, ఇతర సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు పనుల ప్రారంభం

- మాట నిలబెట్టుకున్న 'మెట్టు'



పనులు కొనసాగుతున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లు చెరువు అవుట్‌ఫ్లో రెగ్యులేటర్ వద్ద కూలిన బ్రిడ్జి స్థానంలో ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేస్తానని ఏపీఐఐసీ చైర్మన్, రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. దారి ఏర్పాటు చేస్తానని చెప్పిన నాలుగు రోజులకే పనులు ప్రారంభించేలా ఆయన చర్యలు తీసుకున్నారు. గత నవంబర్‌లో వరిధాన్యంతో ఈచర్ వాహనం వస్తుండగా బ్రిడ్జి కూలిన విషయం విదితమే. బ్రిడ్జి కూలడంతో గంగలాపురం, రచ్చుమర్రి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ మార్గంలో సుమారు వెయ్యి ఎకరాల వరకూ ఆయకట్టు ఉండడంతో పొలాలకు రాకపోకలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 9న కణేకల్లుకు వచ్చిన మెట్టును ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలతోపాటు రైతులు విజ్ఞప్తి చేయడంతో దారి ఏర్పాటుకు చర్యలు తీసుకొంటానని హామీచ్చారు. దీంతో ఆయన తన సొంత నిధులతో ప్రత్యామ్నాయ దారి పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కోకుర్తి జయరామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వై.చంద్రమోహన్‌రెడ్డి, టీఎస్ఎస్ రౌఫ్ పనులు చేయిస్తున్నారు. కాగా పనులు ప్రారంభమవడంతో గంగలాపురం, రచ్చుమర్రి గ్రామస్తులతోపాటు ఆయకట్టు రైతులు మెట్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు, రేపు బళ్లారిలో దీని ఇస్తెమా



ఇస్తెమాకు సంబంధించి ఏర్పాట్లపై చర్చిస్తున్న తబ్లిగీ జమాత్ పెద్దలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం డివిజన్, బళ్లారి డివిజన్‌కు సంబంధించిన దీని ఇస్తెమా ఆది, సోమవారం బళ్లారిలోని ఈద్గా మైదానంలో నిర్వహించనున్నారు. తబ్లిగీ జమాత్ ఆధ్వర్యంలో ఇస్తెమాకు భారీ సంఖ్యలో ముస్లింలు తరలిరానున్నారు. ఆ కార్యక్రమాన్నివిజయవంతం చేసే దిశగా జమాత్ పెద్దలు స్థానికంగా ముస్లింలతో సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించారు. ఇజ్తేమాకు బెంగళూరు నుంచి మౌలానాలు హాజరవుతున్నారని, రాయదుర్గం డివిజన్ నుంచి ముస్లింలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇస్తెమాలో ఆధ్యాత్మిక బోధనలు, నమాజ్ ప్రాముఖ్య, సామూహిక నమాజ్‌లతో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇజ్తేమాకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం 9 గంటలకు హెల్పింగ్ హ్యాండ్స్ ఫ్రెండ్స్ గ్రూప్‌తోపాటు మరో ఇద్దరు దాతల సహకారంతో రెండు బస్సులు ఏర్పాటు చేశారని నిర్వాహకులు తెలిపారు.


ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి



అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఉరవకొండ: అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయచంద్ర, పీజీఎస్ నూర్‌మహ్మద్ ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎంసీ నాగభూషణం, లక్ష్మీనారాయణ, యేళ్ల ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ మృతికి సంతాపం



ఆంజనేయులు(ఫైల్)

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న వాల్మీకి ఆంజనేయులు అకాల మృతికి డీఎం రామచంద్ర, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది సంతాపం తెలిపారు. శనివారం వేకువజామున కర్నూలు జిల్లా ఆదోని సమీపంలో ముందు వైపు వెళ్తున్న లారీని కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో బస్సు వెనుక వైపు నుండి ఢీకొంది. బస్సు డ్రైవర్ ఆంజనేయులు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో.. కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయన మృతి ఎంతో కలిచి వేస్తోందని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మృతునిది బుక్కరాయ సముద్రం స్వగ్రామం.

దాడి కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ సర్పంచ్ నాగవేణి భర్త వన్నూరుస్వామిని కులం పేరుతో దూషించి దాడి చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో కల్లుదేవనహళ్లికి చెందిన పి. ఆంజనేయులు గోవిందవాడ గ్రామంలో ఇంటి వద్ద ఉన్న వన్నూరుస్వామిని కులం పేరుతో దూషించి దాడి చేశారని, అడ్డు వచ్చిన రాజీవ్ అనే వ్యక్తిపై కూడా రాయితో కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

వజ్రకరూరు: సంక్రాంతి పండుగ తర్వాత గ్రామాల వారీగా ఈ–కేవైసీ నమోదు ప్రక్రియ ప్రార ం భించనున్నట్లు జయప్రద ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ రాయితీకి సంబంధించి వినియోగదారుల ఈ–కేవైసీ నమోదు చేస్తామన్నారు. మండలంలోని గ్యాస్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న టెట్రా ప్యాకెట్లను చూపుతున్న ఎస్‌ఐ యువరాజు

కంబదూరు: అక్రమంగా తరలుతున్న కర్ణాటక మద్యాన్ని కంబదూరు పోలీసులు పట్టుకున్నారు. శనివారం కళ్యాణదుర్గానికి చెందిన కొండమ్మ అనే మహిళ కర్ణాటక మద్యాన్ని తీసుకెళ్తుండగా గుర్తించి కంబదూరు చెక్ పోస్ట్ వద్ద ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 100 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యువరాజు తెలిపారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట సర్పంచ్ రాధమ్మ భర్త రమేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, నాయకులు తాళ్లకెర వీరభద్రరెడ్డి, జయరామిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

విడపనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన తలారి తిప్పన్న బళ్లారి నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా విడపనకల్లు బస్టాండు వద్ద లారీ ఢీ కొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

అంబేడ్కర్ సేవలు అజరామరం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న విశ్వ

ఉరవకొండ: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భారత జాతికి అందించిన సేవలు అజరామరమని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి పోస్టర్ల విడుదలతో పాటు సమావేశానికి తరలివెళ్లేందుకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, కూడేరు వైస్ ఎంపీపీ సుంకమ్మతో కలసి ఆయన విగ్రహావిష్కరణ పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమానికి కులమత, వర్గ విబేధాలు లేకుండా ప్రజలంతా తరలిరావాలన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో జాతి గర్వించేలా ఈ కార్యక్రమం జరగనుందన్నారు. రూ.404 కోట్ల వ్యయంతో కనీ వినీ రీతిలో విగ్రహం అద్భుతంగా రూపుదిద్దుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్యానికి భరోసా 'సీఎంఆర్‌ఎఫ్'

నిరుపేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన చెక్కులను శనివారం ఉరవకొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన అందజేశారు. ఉరవకొండ పట్టణానికి చెందిన దివంగత బ్యాంకు ఓబులేసు భార్య రాజ్యలక్ష్మికి రూ.2 లక్షలు, పచ్చికుంట ఉలిగమ్మకు రూ.3.40 లక్షలు, కూడేరు మండలం కలగళ్లకు చెందిన శ్రీదేవికి రూ.65 వేలు, బెళుగుప్ప మండలం అంకంపల్లికి చెందిన గొల్ల లక్ష్మికి రూ.1.60 లక్షల విలువచేసే చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సీపీ వీరన్న, బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, వన్నప్ప, సుబ్బమ్మ, ఇప్పేరు రమేష్, జయపురం సంజీవ తదితరులు పాల్గొన్నారు.